# కాశ్మీర ఫీవర్



బి.వి. రమణారావు

మళ్ళీ పదిహేనేళ్ళ తర్వాత శ్రీనగర్ ప్రయాణం తగిలింది. వస్తావా అని మా ఆవిడ నడిగేను. మాట్లాడలేదు. సరే రాదు కదా అని సంతోషించేను. ఏం బుద్ధిపుట్టిందో మరి తల్లీకొడుకు ఏం కూడబలుక్కున్నారో తెలీదు, సాయింత్రం "ఆనంద్ కూడా వొస్తా నన్నాడు. ముగ్గురికీ టిక్కట్లు కొనండి." అంది. ఆనంద్ మా సుపుత్రుడు. యం.డి. చేశాడు. ప్రేక్టీస్ పెట్టడమా, సర్వీస్‌లో చేరడమా అన్నది యింకా నిర్ధారణ చేసుకోలేదు. ఈ మధ్యనే ఏవో ఇంటర్‌వ్యూ కనిచెప్పి ఢిల్లీ వెళ్ళి వారంరోజులుండి వొచ్చేడు. అది ఏ మింటర్‌వ్యూ అని నేనడగలేదు, వాడు చెప్పలేదు. వాడి మొండి ధోరణి ఎరుగున్నవాణ్ణి కాబట్టి వాడి విషయంలో ముభావంగా వుండటం అలవాటు చేసుకున్నాను. గోరంతల్ని కొండంతలు చేసి, నేను తాగుబోతుననీ, ముండల ముఠా కోరుననీ, ఇల్లూ సంసారబాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వుంటానని మా ఆవిడ ఆనంద్‌కి ఉగ్గుపాలలో బాటే నూరిపోసింది. ఈ మధ్య నాకు కాస్త బ్లడ్‌ప్రెషర్ పెరగడంతో, నేను బయట ఎక్కువ తిరగకూడదనీ, విశ్రాంతి ఎక్కువ తీసుకోవాలనీ, సాయింత్రాలు పెందరాళే యింటికి తిరిగిరావాలనీ, కేప్సూల్స్ రోజూ మూడుపూట్లా శ్రద్ధగా వేసుకోవాలనీ, అసలు డ్రింక్స్ దరిదాపులకు వెళ్ళకూడదనీ కండిషన్లు పెట్టి, వాటిని అతిక్రమించకుండా నా మీద నిఘా వుంచి నా ప్రాణాలు తీస్తున్నారు. కొద్ది రోజుల పాటు స్వేచ్ఛగా గాలి పీలుద్దామని ఈ కాశ్మీర్ ప్రయాణం పెట్టుకున్నాను. అక్కడ జరిగే కాన్ఫరెన్స్‌కి నేను డెలిగేట్‌గా వెడితే మా వ్యాపారసంస్థ కొచ్చే లాభం లేదు, వెళ్ళకపోతే వొచ్చే నష్టం లేదు. మధ్యలో మా వాడు తోకలాగ వెంబడిస్తాననడం నేను ఊహించలేని పరిమాణం.

నేను వెంటనే 'సరే' అనకపోవడంతో మా ఆవిడ రెచ్చిపోయి "నా కసలే ఆయాసం, కీళ్ళ నెప్పులూను. కూడా ఆనందుంటే కాస్త మందో మాకో పడేసి చూస్తాడు. లేకపోతే మీరు నన్ను ఏ హోటల్లోనో పారేసి మీ తిరుగుళ్ళు మీరు తిరుగుతారు. అసలు మీకి కాశ్మీర్ ప్రయాణం లేకపోయినా బాగుణ్ణు. పదిహేనేళ్ళ క్రితం వెళ్ళి గుండె చేత్తో పట్టుకుని మూలుగుతూ తిరిగొచ్చేరు. హడిలి చచ్చేం. ఏదో మా అదృష్టం బాగుంది మీకూడా అప్పుడు డాక్టర్ శ్రీనాధ్‌గారుండబట్టి సరిపోయింది. అంచేత వెడితే ఆనంద్‌ని కూడా తీసుకుని వెడదాం. లేకపోతే మీరు కూడా వెళ్ళడానికి వీల్లేదు." అంటూ లెక్చరిచ్చింది. మావాడు "హియర్! హియర్!" అన్నాడు.

* * *

డాక్టర్ శ్రీనాథ్ నాకు దూరపు బంధువు. అంతకంటే ముఖ్యంగా ఆప్త మిత్రుడు. చిన్నప్పుడే వాడి తల్లితండ్రులు పోయేరు. ఉన్న కొద్దిపాటి భూమి, యిల్లు అమ్మేసి ఆ డబ్బు నా దగ్గర పెట్టుకొని, స్వయంకృషితో మెడిసిన్ చదువుకుని నా సలహా మీద ప్రేక్టీస్ పెట్టేడు. డాక్టర్‌గా మంచిపేరు, డబ్బూ, వాటితో బాటు దానధర్మాల్లో ఉదారస్వభావుడనే కీర్తి గడించేడు. శ్రీనాధ్ మామగారు కోటీశ్వరుడు, నాకు దగ్గిర బంధువు. నేను వ్యాపారంలో పైకి రావడానికి సాయం చేసినవాడు. మా వ్యాపారంలో ఆయన కొడుకు, రఘు నాకు భాగస్వామి. నేనూ రఘూ పట్టుబట్టి శ్రీనాధ్ మామగార్ని ఈ సంబంధానికి వొప్పించేం. శ్రీనాధూ భార్య అన్యోన్యంగా, చూడముచ్చటైన దంపతులుగా వుండేవారు. మా యింటి పక్కనే స్థలంకొని యిల్లు కట్టుకున్నారు. శ్రీనాధ్‌కి ఒక్కడే కొడుకు, ప్రసాద్. నాకో కొడుకూ, కూతురు. వరసలు

కలుపుకుని ఒకళ్ళనొకళ్ళు పిల్చుకుంటూ మా రెండు కుటుంబాలూ ఒకే కుటుంబంలా గుండేవాళ్ళం. శ్రీనాథ్ పెళ్ళై పదేళ్ళయింది, ఏ దేవత శాపమో! శ్రీనాథ్ భార్య కారు ఏక్సిడెంట్లో పోయింది. కారు డ్రయివ్‌చేసుకు వెడుతుండగా ఓ లారీ వొచ్చి గుద్దేసింది. అక్కడికక్కడే ఆమె ప్రాణం పోయింది.

భార్య పోయింతర్వాత శ్రీనాథ్‌ని మళ్ళీ పెళ్ళిచేసుకోమని అటు వాడి అత్త మామలు, యిటు మేమూ శతవిధాల బ్రతిమాలేము. ఒప్పుకోలేదు, ఎనిమిదేళ్ల కొడుకు ప్రసాద్‌ని పబ్లిక్‌స్కూల్లో చేర్చి ఏకాకిగా రోజులు గడుపుతున్నాడు. అవసరమైన పనిమీద నేను శ్రీనగర్ వెళ్ళవల్సొచ్చింది. అప్పటికి శ్రీనాథ్ భార్య పోయి మూడేళ్ళు దాటింది. నాకు తోడూ వుంటాడు, వాడికీ కాస్త వాతావరణం మార్పుంటుందని శ్రీనాథ్‌ని కూడా బలవంతంచేసి కూడా తీసుకుపోయేను.

ఢిల్లీలో రెండు రోజులు గడిపేం. నా వ్యాపారం పనికూడా చూసుకున్నాను. అక్కణ్ణుంచి జమ్మూ వెళ్ళేం. ఓ రోజున అమృత్‌సర్ వెళ్ళి గోల్డెన్ టెంపుల్ చూసొచ్చేం. మర్నాడు ఉదయాన్నే బయల్దేరి అక్కడికి నలభై మైళ్ళ దూరంలో వున్న వైష్ణవిదేవి ఆలయం చూడ్డానికి టెక్సీలో వెళ్ళేం. తిరుపతిలాగే ఆలయం వరకూ కారు వెడుతుందనుకున్నాను. ఆ ఆలయం ఓ పర్వతం మీదుంది. అక్కణ్ణుంచి గుర్రాలమీదెక్కి పది కిలోమీటర్లెక్కడం పదికిలోమీటర్లు దిగడం. కొండదారి నిటారుగా వుంది. అదీ మూడడుగులు వెడల్పు మించి లేదు. దారినిండా రాళ్ళూ, రప్పలూ, తుప్పలూ. ఓ వైపున ఆకాశాన్నంటే కొండ, మరో వైపు పాతాళంలాంటి లోయ. ఆ మూడు అడుగుల దార్నే వొచ్చే గుర్రాలూ, వెళ్ళే గుర్రాలూ, అవి ఒకదాన్నొకటి తప్పించుకున్నప్పుడు నే నెక్కిన గుర్రం రోడ్డు అంచున అడుగులేస్తుంటే గుండెలు దడదడలాడి కళ్ళు మూసుకునేవాణ్ణి. మమ్మల్ని గుర్రాలెక్కించి, పదడుగుల దూరంలో ఆ గుర్రాల తాలూకు రౌతులు నడుస్తూ వుంటారు. సగం దూరం ఎక్కేక నాకు భయంతో ముచ్చెమటలూ పోశాయి. ముందుకూ వెళ్ళలేక వెనక్కి వెళ్ళలేక గుర్రంమీంచి దిగి ఓ రాయిమీద చతికిల పడ్డాను తర్వాత నా చుట్టూ పదిమందీ చేరి, ఆ గుర్రాలకి చిన్నప్పట్నుంచీ తర్ఫీదిచ్చేరనీ, తప్పటడుగులు వెయ్యవనీ, ఏం భయంలేదనీ, ఆ గుర్రం తాలూకు రౌతు పక్కనేవుండి నడిపిస్తాడనీ అభయమిచ్చిన మీదట మళ్ళీ గుర్రం ఎక్కేను. శ్రీనాథ్ మాత్రం ఏ చీకూ చింతా లేకుండా స్వారీచేస్తూ నా అవస్థకి నవ్వుతూ ధైర్యంచెప్పేవాడు. వైష్ణవదేవి విగ్రహం ఓ యిరుకైన గుహలో వుంది. దానికి సాయం రెండు కాళ్ళూ రెండు చేతులమీద పాకుతూ ఓ యిరవై అడుగులు వెళ్ళాలి. దార్లో అడ్డంగా స్పీడుగా ఓ చన్నీటి ప్రవాహం. ఆ నీటిలో పాకుతూవుంటే ఆ చన్నీటి స్పర్శతో చేతులూ కాళ్ళూ కొంకర్లు పోయేవి. అసలీ దేవుళ్ళు కొండలమీదో గుహల్లోనూ ఎందుకు వెలుస్తారో తెలీదు. పుణ్యం మాట దేవుడెరుగు, బయటపడితే చాలనిపించింది.

తిరిగి వొచ్చేటప్పుడు నేను గుర్రం మీద కూర్చోలేకపోవడం, డోలీలాంటిది ఏర్పాటుచేసి నన్ను మోసుకు తీసుకు రావడం, టేక్సీలో ఎక్కించడం, జమ్మూలో మేమున్న గెస్ట్‌హవుస్ కొచ్చింతర్వాత నన్ను మోసుగొచ్చి మంచం మీద పడుకోబెట్టడం, శ్రీనాథ్ నాచేత బ్రాందీ తాగించి ఇంజెక్షన్ ఇవ్వడం, పొద్దున్న మెలకువొచ్చేక ఒక్కొక్కటే గుర్తుకు వొచ్చేయి. ఆ రోజుల్లా పూర్తి బెడ్‌రెస్ట్ తీసుకుని మర్నాడు మార్నింగ్ ఫ్లయిట్‌లో శ్రీనగర్ వొచ్చేం.

ముందుగానే ఫోన్‌చేసి చెప్పేనుకనక మా కంపెనీ డిస్ట్రిబ్యూటరు సిన్హా మాకు హోటల్ గోల్డెన్ వేలీలో రెండు డబుల్‌రూంస్ బుక్ చేశాడు. శారీరకంగానూ, మానసికంగానూ బాగా అలసిపోయానేమో బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని పక్కమీద నడుం వాల్చగానే నిద్ర పట్టేసింది. రెండింటికి శ్రీనాథ్ లేపి లంచ్‌కి రమ్మనేవరకూ మెలకువ రాలేదు. లంచ్ తర్వాత శ్రీనాథె సైట్ సీయింగ్‌కి వూళ్లో కెళ్ళేడు. సిన్హా, అతనితో వొచ్చిన స్నేహితులూ నేనూ నా రూంలో రమ్మీ ఆడుతూ కూర్చున్నాం. సిన్హా గతంలో రెండుసార్లు హైదరాబాదొచ్చినా ఆతిధ్యం చవిచూసినవాడు కనక నా అభిరుచులూ సరదాలు తెలిసినవాడు. రాత్రి ఏర్పాటు గురించి నేనేం చెయ్యాలో రహస్యంగా తారకమంత్రోపదేశం చేశాడు.

సాయంత్రం రెండు రౌండ్లయిం తర్వాత అందరూ ఎవరివారివ వాళ్ళు వెళ్ళటానికి లేచేరు. శ్రీనాథ్ తన గదిలోనే డిన్నర్ తీసుకుని పడుకుంటానని చెప్పి వెళ్ళిపోయేడు. డాల్ లేక్‌లో పూల్‌మంజిల్ అనే బోట్‌హవుస్ నాకు రిజర్వ్ చేసినట్టూ, అక్కడ తాగడానికి తినటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టూ రాత్రి ఎనిమిదిన్నర కల్లా సిద్ధంగా వుండమనీ, తను మళ్ళీ పొద్దున్నే వొచ్చి కల్పుకుంటాననీ చెప్పి వెళ్ళిపోయేడు.

ఎనిమిదిన్నరయింది. టకటక తలుపు మీద మృదువుగా చప్పుడయింది. ఓ క్షణం తర్వాత నెమ్మదిగా తలుపు తెరుచుకుని గుమ్మంలో నిలబడి "మే అయ్ కమిన్?" అన్న విగ్రహం కేసి చూసి 'వెల్‌కం' అన్నాను. చక్కని రూపం. పాతిక ముప్పయి మధ్య వయస్సున్న ప్రౌఢ. మనిషి పొడగరి, తగ్గ సొంపైన

వొంపులతో ఆకర్షణీయంగా వుంది. కాశ్మీరీ గర్ల్ కాదు. వాళ్ళు గోల్డెన్ కాంప్లెక్షన్‌తో రోజీచీక్స్‌తో అందమైన బొమ్మల్లా వుంటారు. దే రీజ్ ఎ టచ్ ఆఫ్ డివినిటీ ఇన్ దెయిర్ బ్యూటీ. ఈ అమ్మాయి ఏంగ్లో ఇండియనో, పార్సీ గర్లో అయివుండాలి. ఏది ఏమైనా సిన్హా ఆమెని వర్ణిస్తుంటే నే నూహించిన ఆకారంకంటే ఈమె అందంగా వుంది. ఏ విధమైన ఆడంబరమైన మేకప్పూ లేదు. ఆభరణాలు లేవు, కనీసం గాజులు కూడా లేవు. ప్లెయిన్ స్కై-బ్లూ శారీ, కొంచెం డార్క్-బ్లూ షేడ్‌లో లోకట్ 'వి' బ్లౌజు. మొహాన బొట్టులేదు. బాబ్డ్ హెయిర్. హెయిర్ నెట్ వేసుకుంది. మార్బుల్ కాంప్లెక్షన్, చక్కని పలు వరస. స్వీట్ స్మయిల్‌తో లోపలికొచ్చి, చేతిమీదున్న వైట్ షాల్, బుజానున్న ఫర్ వేనిటీబేగ్ కుర్చీలో పెట్టి, మంచం మీద దూరంగా కూర్చుంది. ఆమె చెయ్యి అందుకుని ఆమెని దగ్గరగా లాక్కో బోయేను. "ప్లీజ్, నాట్ హియర్. లెటజ్ గో టు ది హవుస్‌బోట్" అంది. రాత్రికి కావల్సిన సరంజామా అంతా బ్రీఫ్‌కేస్‌లో సర్దుకొని సిద్ధంగా వున్నాను. నేను స్లిపాన్స్ తొడుక్కుని లేచి నిలబడి టేబుల్‌మీదున్న బ్రీఫ్‌కేస్ అందుకో డానికి రెండడుగులు వేసేనో లేదో కాళ్ళు తడబడ్డాయి, కళ్ళు చీకట్లు కమ్మేయి. మెడమీద, మొహం మీద, తర్వాత చూస్తుండగా వొళ్ళంతా చెమటలు పట్టేయి. విపరీతమైన నీరసంతో ముందుకు తూలి పడబోయేను.

నేను కళ్లు తెరిచేటప్పటికి నా పక్కన శ్రీనాథ్ కూర్చున్నాడు. ముక్కులో ఆక్సిజన్ ట్యూబు, ఎదురుగుండా స్టేండ్‌కి వేళ్ళాడుతున్న ట్రాన్స్‌ఫ్యూషన్ బాటిలూ, నా ఎడమచేతి రిస్ట్‌కి ప్లాస్టర్‌తో ఫిక్స్‌చేసిన సిరంజి నీడిల్, కొంచెం పక్కగా హార్ట్‌బీట్స్ రికార్డ్ చేసే


'యువ 1960 ఆగస్టు సంచికనుండి'



రోజులు మారాయి!

ఎలక్ట్రోకార్డియోగ్రాం, గుండెలమీద చేత్తో తడుముకుంటే, దాని తాలూకు మానిటర్ గమనించేను. చుట్టూ చూశాక నేనేదో హాస్పిటల్లో కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ వార్డ్‌లో వున్నట్టు గ్రహించేను. శ్రీనాథ్ నాకేసి నవ్వుతూ "ఒకే టీజీ, యూ ఆర్ ఆల్‌రైట్, నౌ. సమయానికి ఈ అమ్మాయి అక్కడ వుండబట్టి సరిపోయింది." అంటూ నా చెయ్యి చరిచేడు. నాకు ప్రాణదానంచేసిన ఆమె ఎవరా అని శ్రీనాథ్ పక్కన నిలబడ్డ యువతి కేసి పరిశీలనగా చూశాను. కొన్ని క్షణాల తర్వాత గుర్తుపట్టేను - రాత్రి నా రూం కొచ్చిన అమ్మాయి.

ఆ అమ్మాయి పేరు స్టెల్లా ఆనీ ట్రెయిన్డ్ నర్స్ అనీ మర్నాడు తెల్సుకున్నాను. మూడురోజులపాటు శ్రీనాథూ స్టెల్లా నా మంచాన్ని అంటిపెట్టుకుని పరిచర్యలు చేశారు. నాలుగో రోజున, డాక్టర్ దివేందర్ నన్ను పరీక్ష చేసి హోటల్‌కి వెళ్ళి నాలుగైదు రోజులు కంప్లీట్ రెస్ట్ తీసుకుని మరీ వెళ్ళమని హెచ్చరించేడు, హోటల్‌కి తిరిగొచ్చేను. రోజూ ఉదయం నన్ను పరీక్షచేసి ఏవో కేప్సూల్సు టేబ్లెట్లు ఎలా వేసుకోవాలో చెప్పి, వాటితోబాటు నా మొహాన్ని పత్రి




కలు పుస్తకాలు పడేసి బుద్ధిగా చదువుకోమని చెప్పి శ్రీనాథ్ స్టెల్లాను తీసుకుని ఓ రోజున ఫాల్‌గాం, ఓ రోజున గుల్‌మార్గ్, ఓ రోజున మొగల్ గార్డెన్స్ తిరిగిరావటం మొదలెట్టేడు. రాత్రిళ్ళు స్టెల్లా వెళ్ళిపోయేది. శ్రీనాథ్ నా రూంలోనే పడుకుని నాకు కావల్సిన పరిచర్యలు చేసేవాడు.

శ్రీనాథూ స్టెల్లా కలిసి తిరగడం చూసి సంతోషించేను. వాడిలో కనిపించిన ఉత్సాహం ఆనందం చూసేక వీడు మళ్ళీ మనిషవుతాడనే ఆశ కలిగింది. ట్రెయిన్డ్ నర్స్ అయిన స్టెల్లా ఇలా అపరిచితులకు వొళ్ళు అమ్ముకోడం నాకు ఆశ్చర్యం కలిగించింది. హోటల్ మేనేజర్ మా డిస్ట్రిబ్యూటర్, హోటల్‌బాయ్‌ల దగ్గిర్నుంచి స్టెల్లాని గురించి కొన్ని వివరాలు తెలుసుకున్నాను. ఆమెకి పెళ్ళయిందట, ఎనిమిదేళ్ళ కూతురు సెయింట్ జోసఫ్ మాంటిసోరీ రెసిడెన్సియల్ స్కూల్లో చదువుకుంటుందిట. ఆమె భర్త పేరు ఎబునైజర్. అతనో ఆటోమొబైల్ వర్క్‌షాప్‌లో మెకానిక్. నన్ను చేర్చిన లేక్‌వ్యూ నర్సింగ్‌హోంని డా॥ సవితా చటర్జీ అనే బెంగాలీ లేడీ స్థాపించిందట.

ట్రయినింగూ మెకానిజం తెలుసున్నవాణ్ణి అన్వేషించడంలో డా॥ సవితాచటర్జీకి ఎబునైజర్ తటస్థపడ్డాడు. ఎబునైజర్ తెలివైనవాడు, చురుకైనవాడు, అందమైనవాడు. ఎబునైజర్ స్టెల్లాలకు తన అవుట్‌హవుస్‌లోనే మకాం ఏర్పాటు చేసింది. స్టెల్లా అవివాహిత అని చెప్పి అప్లికేషన్‌లో తన పలుకుబడి ఉపయోగించి నర్సింగ్ స్కూల్లో సీటు సంపాదించి ట్రెయినింగ్‌కి పంపింది. సవితా చటర్జీ పేరుపడ్డ సైకాలజిస్ట్. అందమైంది కాకపోయినా అనాకారి కాదు. పెళ్ళిచేసుకోలేదు. స్టెలా ట్రెయినింగ్ పూర్తయి తిరిగివొచ్చేక తన నర్సింగ్‌హోంలోనే వుద్యోగం యిచ్చింది. అప్పటికే డాక్టర్ సవితా ఎబునైజర్లు ప్రణయ కలాపాలు సాగిస్తూన్నట్టు పుకార్లు పుట్టేయి. అప్పటికి ఎబునైజర్‌కి ముప్పైయేళ్ళుంటే సవితకి నలభైయ్యేళ్ళు. ఒక ఏడాదిపాటు నయాన్నా భయాన్నా భర్తని త్రోవలోకి తెచ్చుకోడానికి ఓర్పుతో

ప్రయత్నించింది. భర్త మొండికెత్తి యింటికి రావడం మానేసి సవిత క్వార్టర్స్‌లోనే మకాం పెట్టడంతో పరిస్థితి శృతిమించి మిగిలిన డాక్టర్ల సమక్షంలో పంచాయితీ పెట్టింది. ఆ అవమానంతో నర్సింగ్‌హోం అమ్మేసి ఎబునైజర్‌తో ఢిల్లీ వెళ్ళిపోయింది డాక్టర్ సవిత. అప్పటికే స్టెల్లా గర్భవతి పెళ్ళికాలేదని అబద్ధం చెప్పి నర్సింగ్ స్కూల్లో చేరినట్టు సవితా చటర్జీ కంప్లెయింట్ చెయ్యడంతో స్టెల్లా తన సర్టిఫికెట్ పోగొట్టుకోగా క్రిమినల్ ఏక్షన్ నుంచి బయటపడేటప్పటికి చావుతప్పి కన్ను లొట్టబోయినంత పని జరిగింది. ఎబునైజర్ కోరినట్లు డైవోర్సిచ్చి పొమ్మంది. మనోవర్తి అక్కర్లేదు పొమ్మంది. లేక్‌వ్యూ నర్సింగ్‌హోంలోనే తెలుసున్న డాక్టర్లు స్టెల్లాకి ఉద్యోగం యిచ్చేరు. చాలీచాలని జీతం, అందరికీ తెలిసిన ఆమె చరిత్ర, కోరికలు రేకెత్తించే ఆమె వయస్సు, తలకు మించిన భారమైన కూతురు కాన్వెంటు చదువు, తనకు రక్షణ యివ్వని ఈ సామాజిక విలువలంపట్ల కల్గిన నిర్లక్ష్యం - వీటి ప్రభావంవల్ల అవసరమైనప్పుడు ఇలా వొళ్ళు అమ్ముకుని డబ్బు గడిస్తుంది. ఇవీ నేను స్టెల్లాని గురించి సేకరించిన వివరాలు. చూస్తున్నాము కదా! చక్కని రూపం. మొహంలో ప్రశాంతతోబాటు నిర్లక్ష్యభావం కూడా స్ఫురిస్తుంది. మాటల్లో వయస్సుకు మించిన ప్రపంచానుభవం సమయస్ఫూర్తి కనబడతాయి. శ్రీనాధ్‌లాంటి మొండి ఘటాన్ని లొంగదీసుకుని రంగంలోకి దింపిందంటే ఎంత అసాధారణ వ్యక్తో తెలుస్తూనే వుంది.

డాక్టర్ చెప్పిన రెస్ట్ గడువు పూర్తయ్యి రెండు రోజులయ్యింది. నా కిలాగ హార్టెటాక్ వచ్చినట్టు మావాళ్ళెవళ్ళకీ తెలియనీయలేదు. నే నిక్కడ జల్సాల్లోపడి తేల్తున్నాననుకుని అందరూ నన్ను తిట్టుకుంటూ వుంటారు. సాయంత్రం రాగానే రేపే యింక తిరుగుప్రయాణం అని శ్రీనాధ్ కి చెప్పదల్చుకున్నాను. రాత్రి చాలా ఆలస్యంగా వొచ్చేడు. అప్పటికే డిన్నర్ పూర్తిచేసి శ్రీనాధ్ రాకకోసం ఎదురుచూస్తూ నడుం వాల్చేను.

"రేపు మార్నింగ్ ఫ్లయిట్‌లో నువ్వు ఢిల్లీ వెళుతున్నావు. అక్కడ డాక్టర్ కాశీచరణ్ నిన్ను రిసీవ్ చేసుకుని హైద్రాబాద్ ఫ్లయిట్ ఎక్కిస్తాడు.




హైద్రాబాదులో డాక్టర్ మురళీధర్ ఎయిర్‌పోర్ట్‌కొచ్చి నిన్ను రిసీవ్‌చేసుకుని మీ ఆవిడ కంగారుపడకుండా నీ హార్టెటాక్ గురించి చెబుతాడు. నువ్వు బయల్దేరొస్తున్నట్టు మీ ఆవిడకి ఫోన్లో చెప్పేను. నేనో వారంరోజుల తర్వాత వస్తాను. ఈ టెలిఫోన్లన్నీ చేసేటప్పటికి లేటయింది" అంటూ ఎయిర్ టికట్స్‌వున్న కవర్ నా చేతుల్లో పెట్టేడు.

"ఇంక చాలు. నువ్వు కూడా వొచ్చెయ్యి. నీకు సరదాయే వుండాలి

కాని స్టెల్లాని తలదన్నిన బ్యూటీస్‌ని నీకు హైదరాబాదులో పరిచయం చేస్తాను." అన్నాడు.

"నేను స్టెల్లా రేపు రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకుంటున్నాం." అన్నాడు.

"యూ బ్లడీఫూల్...." నాకు వొళ్ళు మండిపోయింది.

"కామ్ యువర్ సెల్ఫ్. నువ్వు ఎక్సయిటవ్వకూడదు. నేనన్నీ ఆలోచించుకునే యీ నిర్ణయాని కొచ్చేను."

"మంచి సాంప్రదాయంగల కుటుంబాల్లోంచి చక్కని పిల్లల్ని చూపెడితే వొద్దు పొమ్మని ఈ బజారుముండని..."

"ఆ పిల్లలు ఈడైన పెళ్ళికొడుకులు దొరక్క కలలు కరిగిపోయి, కోరికల్ని చంపుకుని రెండో పెళ్ళివాడిని చేసుకోడానికి సిద్ధమయ్యేరు. అలాంటి పిల్లని కట్టుకుని సరదాలు తీర్చే రొమాంటిక్ డిస్పోజిషన్ నాలో యిప్పుడు లేదు."

"మరి స్టెల్లాకి కోరికల్లేవా? రొమాన్స్ అక్కర్లేదా?"

"భార్యపోయిన నేనూ, భర్త వొదిలేసిన స్టెల్లా ఏకాకుల మయ్యేం. మా మధ్య సానుభూతి, సౌహార్ద్రం, స్నేహం...."

"స్టెల్లాని హైదరాబాద్ తీసుకొచ్చి నీ నర్సింగ్‌హోంలో ఉద్యోగం ఇయ్యి. కావల్సినంత డబ్బియ్యి. అటువంటి సందర్భంలో మీ మధ్య ఎటువంటి సంబంధమున్నా సమాజం సానుభూతితో సహిస్తుంది, క్షమిస్తుంది. అంతేకాని దాన్ని పెళ్ళాడి పరువు ప్రతిష్ట మర్యాదా మంటగల్పుకుంటావా!"

"అవన్నీ నిలబడాలనే ధైర్యంగా పెళ్ళిచేసుకుంటున్నాను. అదే మాకు గౌరవప్రదం...."

"దిసీజ్ నథింగ్ బట్ ఇడియాటిక్ మిడిలేజ్డ్ ఇన్‌ఫేచుయేషన్.! ఒరేయ్ బ్లడీ ఫూల్! ఆ రాత్రి నాకు హార్టెటాక్ రాకపోతే...."

"నీ దగ్గర పడుకునుందేది. అంతక్రితం చాలామందికి ఒళ్ళు అమ్ముకుంది.. ఈ మాటే తనూ చెప్పింది...."

"దానికో కూతురుంది తెలుసా?"

"జోసఫీన్. ఏడెనిమిదేళ్ళుంటాయి. రెండు సార్లు వెళ్ళి చూసొచ్చేం. ఛార్మింగ్ చైల్డ్...."

"రంకుముండని పెళ్ళాడ్డమేమిట్రా దౌర్భాగ్యుడా! ఈ పెళ్ళే నిజంగా జరిగితే మీ మామ, మీ బావమరిది రఘూ, ఇదా మీరు శ్రీనగర్ వెళ్ళి చేసుకొచ్చిన నిర్వాకం అని మధ్య నా మొఖం తగలేస్తారు."

"అందుకే నిన్ను పంపించేశాక పెళ్ళి చేసుకుంటున్నాం."

"నా మాట వినరా. కావలిస్తే దాన్నక్కడకి తీసుకొచ్చి వుంచుకో. నీ పరిస్థితి తెలిసినవాళ్ళెవరూ తప్పట్టుకోరు. చివరకి నీ కొడుకు కూడా నీకు శత్రువవుతాడు."

"నే నన్నింటికీ సిద్ధంగా వున్నాను."

"కనీసం మన మతమైనా కాదు."

"మతి, మమత మానవత తిన్నగా వుంటే పెళ్ళికి మతం అడ్డురాదు."

"యూ సిల్లీ సెంటిమెంటల్ స్టుపిడ్! దిక్కుమాలిన వేదాంతం నువ్వూనూ!.."

"డోంట్ గెట్ ఎక్సయిటెడ్. నే నేమీ చిన్నపిల్లాణ్ణి కాదు, ఆలోచించుకోకుండా నిర్ణయం తీసుకోడానికి. ఇదేమీ లవ్ యెట్ ఫస్ట్‌సయిటూ కాదు. లౌకికజ్ఞానం లేనివాణ్ణి కాదు. నీ స్నేహం సహకారం నాకు దూరంకాకుండా వుంటే ఎటువంటి పరిస్థితుల్నయినా ఎదుర్కోగలను." అన్నాడు.

• • •

నేను హైద్రాబాద్ తిరిగొచ్చిన మర్నాడు తను స్టెల్లాని పెళ్ళాడినట్టు శ్రీనాధ్ ట్రంకాల్ చేసి చెప్పేడు. ఆ వార్త నేను బయటపెట్టగానే బంధువులందరూ గొల్లుమన్నారు. మా పార్టనర్ రఘూ శ్రీనాధ్ మామగార్కి టెలిఫోన్ చేస్తే ఆయన అగ్గిబుగ్గయి వెంటనే హైదరాబాదు వచ్చి నన్ను వెంటబెట్టుకుని పబ్లిక్ స్కూల్‌కెళ్ళి శ్రీనాధ్ కొడుకు ప్రసాద్‌తో ఈ విషయం చెప్పి కంటతడి పెట్టేడు. తండ్రి రెండో పెళ్ళి చేసుకోడమంటే ఖూనీలాంటి ఘోరమైన నేరమై వుంటుందనుకుని ప్రసాద్ మమ్మల్ని కౌగలించుకుని బేర్ మన్నాడు. ప్రిన్సిపాల్‌ని కల్సుకుని తండ్రి వొచ్చినా ప్రసాద్‌ను బయటకు పంపవద్దనీ, చూడనివ్వొద్దనీ, ఏమైనా యిచ్చినా తీసుకోనివ్వొద్దనీ తండ్రీ సవితితల్లుల వల్ల ఏ విధమైన ప్రాణాపాయం రాకుండా ప్రసాద్ రక్షణ విషయంలో కట్టుదిట్టం చెయ్యమనీ హెచ్చరించేడు. తండ్రికీ సవితితల్లికీ దూరంగా వుండాలనీ లేకపోతే మంచిమాటలు చెప్పి ఏ మందో మాకో పెట్టి చంపేసి ఆస్తి కాజేస్తారనీ ప్రసాద్‌ని కూడా హెచ్చరించేడు. కుర్రాడు హడలిపోయేడు. ప్రిన్సిపాల్‌కి చెమటలు పట్టేయి.

వారం రోజుల తర్వాత శ్రీనాధ్ పెళ్ళికొడుకులా దిగేడు. అదృష్టం బాగుంది పెళ్ళికూతుర్ని కూడా తీసుకురాలేదు. పబ్లిక్ స్కూల్‌కి వెళితే "డాడీ!" అంటూ ఎగిరి గంతేసి తన దగ్గరకి పరిగెత్తికొచ్చే ప్రసాద్ బెదురు చూపులు చూస్తూ చూడగానే లోపలికి పారిపోయేట్ట. తన మామగారింటికి బావమరిది రఘు యింటికి వెడితే వళ్ళు మానించి పొమ్మన్నారుట. ఇప్పుడైనా ఫర్వాలేదు ఓ యాభై వేలో లక్షో పడేసి తెగతెంపులు చేసుకోమన్నాను. తల అడ్డంగా తిప్పేడు.

"అన్నీ యిలాగే జరగొచ్చని వూహించేను అన్ని అవమానాలకీ సిద్ధపడే వొచ్చేను నే నాశించిందల్లా నీ సానుభూతి, సహకారం." అన్నాడు,

"ఒరేయ్! నీ మావ నాకు ఫైనాన్సియర్, నీ బావమరిది నాకు పార్ట్‌నర్.

'యువ 1960 మార్చి సంచిక నుండి'



రోజులు మారాయి

నీతో మాట్లాడేనని తెలిసినా వాళ్ళు నన్నూ నా వ్యాపారాన్నీ, నా పరువునీ భస్మం చేసేస్తారు." అన్నాను.

మరో రెండురోజులు పోయిం తర్వాత మా యింటికొచ్చేడు. వాడి యావదాస్తికీ తన కొడుకు ప్రసాదే వారసుడని రాసిన దస్తావేజు, ఆ ఆస్తి తాలూకు లావాదేవీలన్నిటికీ నాపేర రాసిన పవర ఫెటార్నీ డాక్యుమెంటు నా చేతుల్లో పెట్టేడు. తను శ్రీనగర్ వెళ్ళిపోయి అక్కడే ప్రాక్టీసు పెట్టడానికి నిర్ణయించుకున్నట్టు చెప్పేడు. వాడికి కన్నీటితో వీడ్కోలివ్వటం తప్ప నేను చెయ్యగలిగిందేమీ లేకపోయింది

ఆర్నెల్ల తరువాత ఇన్‌కంటాక్స్ రిటర్న్ ఫయిల్ చెయ్యడంకోసం యిక్కడికొచ్చి నాలుగు రోజులు క్లబ్‌లోనే రూం తీసుకుని వున్నాడు. పరిస్థితులేమీ మారలేదు. ప్రసాద్‌లో కూడా ఏమీ మార్పురాలేదుట. శ్రీనగర్‌లో తన ప్రేక్టీస్ బాగానే వుందన్నాడు. అక్కణ్ణుంచి రెండు మూడేళ్ళకోసారి వొచ్చి నాలుగైదు రోజులుండి వెళుతూ వచ్చేడు. ప్రసాద్‌కి ధైర్యం చెప్పి మంచి మాటల్తో తండ్రి దగ్గరకి రహస్యంగా తీసుకొచ్చేవాణ్ణి. ఆ గంటసేపూ ప్రసాద్ ముళ్ళ మీదున్నట్టుండేవాడు. కళ్ళతో చూసిన తృప్తి తప్ప కొడుకు ఆప్యాయతకి నోచుకోనందుకు బాధపడేవాడు.

• • •

ప్రసాద్ యంబియే పాసై మా వ్యాపారంలో భాగస్వామి అయ్యేడు. అనుకున్నట్టుగానే వాడికి మా అమ్మాయితో పెళ్ళి నిశ్చయమైంది. నిశ్చితార్థం నాటికి శ్రీనాథ్ యిక్కడే వున్నాడు. అయినా వాణ్ణి ఎవరూ పల్కరించకండా వాడి ప్రమేయం లేకుండానే తాంబూలాలు పుచ్చుకోటం జరిగింది. నేను కూడా మౌనం నటించేను. మరో నెల్లాళ్ళలోనే పెళ్ళి ముహూర్తంకూడా దొరికింది. నేను ఎయిర్‌పోర్టుకి వెళ్ళేటప్పటికి ప్రసాద్ శ్రీనాథ్‌లు మాట్లాడుకుంటున్నారు. నన్ను చూసి లేచి నా చెయ్యి పట్టుకుని "పెళ్ళయ్యేక హనీమూన్‌కి తప్పకుండా శ్రీనగర్ వొస్తామంటూ ప్రసాద్ ప్రోమిస్ చేశాడు. నేనే స్వయంగా వచ్చి తీసుకెడతాను. బ్రదర్ యిదంతా నీ చలవే!" అంటూ ఆనంద పారవశ్యంలో నన్ను కౌగలించుకున్నాడు.

పెళ్ళికి శ్రీనాథ్ రాలేదు. తర్వాతయినా వస్తాడేమోనని పదిరోజులు చూశాం. "ఆ ముండ రానిచ్చుండదు." అని అందరూ ఆడిపోసుకున్నారు. పెళ్ళయిన పదిహేను రోజులకి ప్రసాద్‌కి వుత్తరం వొచ్చింది. చదివి నా చేతికిచ్చేడు చదవమని.

మై డియర్ ప్రసాద్!

నీ పెళ్ళికి రావడానికి మీ నాన్నగారు అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఆనందంతో పరవశించేరు. ఆ ఆనందోద్రేకంలోనే మీ

పెళ్ళి నాలుగు రోజులుండనగా గుండె పోటుతో మరణించేరు. వెంటనే యీ వార్త తెలిస్తే మీ పెళ్ళి ఆగిపోతుందన్న వుద్దేశంతో తెలియజేయలేదు.

నేను నీకు తల్లిని కాకపోయినా నీ తండ్రి భార్యని. నీకు శత్రువును మాత్రం కాదు. పెళ్ళవగానే మీ దంపతులిద్దరూ యిక్కడికి హనీమూన్‌కి వొస్తారని ఎన్నో బహుమతులు బట్టలూ కొని వుంచేరు. అవన్నీ నన్ను వెక్కిరిస్తూ ఇక్కడే వున్నాయి.

కన్నతండ్రి లేకపోయినా ఆయన కోరిక తీర్చే అవకాశానికి ఎదురుచూసే నేను నా కూతురూ యిక్కడ వున్నాం. పెళ్ళికి వొచ్చి చూసే అదృష్టానికి నోచుకోని మేము మీ నాన్నగారి కోరిక తీర్చే ఆనందాన్ని మాతో పంచుకోమని హృదయపూర్వకంగా అర్థిస్తూ ఆహ్వానిస్తున్నాను.

ఈపాటి అదృష్టానికి కూడా మేము తగమని తెల్పిననాడు వీటిని హైదరాబాద్ పంపించే ఏర్పాటు చేస్తాను.

ఆశీస్సులతో
నీ తండ్రి వితంతువు
స్టెల్లా.

* * *

నేనూ మా ఆవిడా, మా అబ్బాయి ఆనందూ కాశ్మీరు వెడుతున్నాం కనుక మా అమ్మాయి నువ్వు కూడా వొస్తే సంతోషిస్తానని మా అల్లుడు ప్రసాద్‌కి రాశాను. రెండు నెలల క్రితమే హనీమూన్‌కి అక్కడికెళ్ళేం కనుక రావటం లేదనీ మీకు వీడ్కోలివ్వడానికి హైదరాబాద్ వొస్తున్నామనీ జవాబు రాశాడు. ఎయిర్‌పోర్ట్‌కొచ్చి ప్రసాద్ "మీ రొస్తున్నట్టు ఆవిడకి ట్రంక్‌కాల్ చేసిచెప్పేను. శ్రీనగర్ ఏర్‌పోర్ట్‌లో ఆవిడే స్వయంగా వొచ్చి మిమ్మల్ని రిసీవ్‌చేసుకుంటానంది. వెళ్ళగానే ముందు వాళ్ళింటికే వెళ్ళండి" అన్నాడు. మా అమ్మాయికూడా ఆమోదపూర్వకంగా చిరునవ్వు నవ్వింది.

"మిస్టర్ రామకృష్ణ!" స్మృతి శిథిలాల్లోంచి వెలువడిన అదే మధురస్వరం విని అటు తిరిగేను. అదే అందమైన మందస్మిత వదనం. ఎటొచ్చీ నుదురు కొంచెం ఒడిలి అడ్డంగా కాలం గీసిన గీతలు కనబడుతున్నాయి అవే చురుకైన కళ్ళు. ఇప్పుడు కళ్ళజోడు లోంచి మౌనంగా పలకరిస్తున్నాయి. అదే వొత్తయిన బాబ్డ్‌హెయిర్. ఇప్పుడు మధ్య మధ్య నెరిసిన జుట్టు వెండి తీగల్లా మెరుస్తున్నాయ్. లైట్ లేస్ కుట్టిన వైట్ శారీ, లైట్ బ్లౌజూ ఆమె విగ్రహానికి హుందాతనం యిస్తున్నాయి. నా చేతిమీద ఆమె మృదువుగా చెయ్యి వుంచగానే 'నా ప్రాణస్నేహితుడి భార్య ఒకనాడు నా ప్రాణాన్ని కాపాడిన దేవత, ఈమె కెంత అన్యాయం జరిగిందీ!' అన్న భావతరంగాల మధ్య ఆమె కన్నులలోకి ఒక లిప్తపాటు చూసి తల దించుకున్నాను అప్పుడు నా చేతిమీద పడ్డ కన్నీటి బిందువు నాదో ఆమెదో తెలియలేదు. వెంటనే తేరుకుని "ఈమె నా భార్య జానకి, వీడు మా అబ్బాయి డాక్టర్ ఆనంద్, ఈమె శ్రీనాథ్ భార్య స్టెల్లా" అని పరిచయం లాంఛనం పూర్తిచేశాను. ఎంతో ఆప్యాయంగా వాళ్ళందరినీ పలకరించింది. కార్లో కూర్చుని ఆమె తెచ్చిన కాఫీ వేడివేడిగా కప్పుల్లో పోసి తాగుతూంటే ప్రాణం లేచొచ్చినట్టయింది. ఆనంద్‌ను తీసుకెళ్ళి లగేజ్ క్లియర్ చేసుకొచ్చి డిక్కీలో పెట్టించి ఎయిర్‌పోర్ట్ నుంచి తనే కార్ డ్రయివ్‌చేస్తూ డాల్ లేక్ ఓ కిలోమీటర్ దూరంలోవున్న వాళ్ళింటికి తీసుకెళ్ళింది.

"కావలిస్తే చుట్టం చూపుగా వెళ్ళి ఓ పూటక్కడుండి వాలాయితీ తీర్చుకుందాం కాని వాళ్ళింట్లో నే మకాం పెడతానంటే నేను చచ్చినా ఒప్పుకోమ" అన్న మా ఆవిడ వాళ్ళ యిల్లూ, స్టెల్లా మా రాకకు ఎదురుచూస్తూ మా కోసం చేసిన ఏర్పాట్లు చూశాక మళ్ళీ నోరు మెదపలేదు.

హనీమూన్ కొచ్చినప్పుడు యిక్కడ తీయించిన ఫోటో ఎన్‌లార్జ్‌మెంట్ అనుకుంటాను, హాల్లో పూలదండలతో ప్రసాద్, మా అమ్మాయి సుజాత వున్న ఫోటో మాకు స్వాగతం పలికింది. మరో గ్రూప్ ఫోటోలో ప్రసాద్ పక్కన స్టెల్లా నిలబడింది. సుజాత పక్కన నిలబడ్డ అమ్మాయి జోసఫీన్ అనుకుంటాను. జోసఫీన్ యింట్లో కనపడకపోతే ఎక్కడకెళ్ళిందని అడిగేను.

హవుస్ సర్జెన్సీ పూర్తిచేసి ప్రయివేట్ నర్సింగ్‌హోంలో చేరిందట. ఇవ్వాళ ముఖ్యమైన హాస్పిటల్ డ్యూటీ వుండటం వల్ల సెలవు దొరకలేదుట.

లంచ్ అయిం తర్వాత ఊళ్ళో తిరిగొస్తానని ఆనంద్ ఉడాయించేడు. కీళ్ళ నెప్పులంటూ స్టెల్లా యిచ్చిన హాట్ వాటర్ బాటిల్స్ కాళ్ళకింద పడేసుకుని ముసుగుతన్ని పడుకుంది మా ఆవిడ. రేపటి కాన్ఫరెన్స్ విశేషాలు కనుక్కొస్తానని చెప్పి మా డిస్ట్రిబ్యూటర్‌ని కల్సుకొనడానికి బయలుదేరేను. మా డిస్ట్రిబ్యూటర్ సిన్హా నేనూ గోల్డెన్ వేలీ హోటల్ కొచ్చేం. ఎదురుగా డాల్ లేక్, రకరకాల రంగురంగుల నావలు, విలాసానికి వుల్లాసంగా విహరించే జంటలు చూస్తుంటే ఏదో ఒక విధమైన రొమాంటిక్ ఫీవర్ లాంటిది ఆవహించింది. మా అబ్బాయి వార్నింగూ, మా ఆవిడ నిఘా ఖాతరుచెయ్యకుండా, సిన్హా ఒద్దు మొర్రో అంటున్నా వినకుండా హోటల్లో వున్న బార్‌లో కూర్చుని రెండేసి పెగ్గులు విస్కీ సేవించి బయటకొచ్చి రెండు జరదాపాన్లు బిగించేం. విస్కీ తాగడంలో సిన్హా అగస్త్యుడంతటివాడు. క్రిందటి సారి అనుభవం రీత్యా

నేనేమైపోతానని భయం వాడికి. కిందటి సారి శృంగభంగమయింది. ఈ సారి బోట్ హవుస్ అరేంజ్ చేస్తే కాశ్మీర్ వొచ్చిన థ్రిల్ వుంటుందన్నాను. డిస్ట్రి బ్యూషనేనా వొదిలేస్తాను కాని అలాంటి ఏర్పాట్లేమీ చెయ్యనని సిన్హా మొండి కెత్తేడు.

చేసేదేమీలేక చూసైనా ఆనందిద్దామని కాసేపు డాల్‌లేక్ కేసి చూస్తూ నిలబడి నేను సిన్హా కబుర్లు చెప్పుకుంటున్నాం. 'ఇంటిమేట్' సెంటు గుప్పు మంటుం డగా మెరుపు తీగలాగా ఓ చక్కని చుక్క మా పక్కనుంచి దూసుకు వెడు తుంటే నే నీ లోకంలో కొచ్చేను. "కల్ భీ యిస్ వక్త్ ఆయేంగే. ఏ లో పైసా" అంటూ బోట్‌వాడి చేతికి డబ్బిచ్చింది. "సుక్రియా మేం సాబ్." అన్నాడు వాడు, సలాంపెట్టి డబ్బు జేబులో పెట్టు కుంటూ. ఎంత చక్కటి అమ్మాయి! అంటూ వెళ్ళిపోతున్న ఆ అమ్మాయికేసి పరీక్షగా చూస్తుంటే మత్తు వొదిలింది. అవును స్టెల్లా కూతురు జోసఫీన్. సందేహం లేదు. అదే మొహం. పొద్దున ఫోటోలో చూశాను. ఇదన్నమాట ముఖ్యమైన హాస్పటల్ డ్యూటీ! యధా మాత తధా సుత! సిన్హాని బోట్‌మేన్ దగ్గరకెళ్ళి అవునో కాదో నిర్ధారణ చేసుకు రమ్మన్నాను. కనుక్కొచ్చేడు. ఆమె డాక్టర్ శ్రీనాధ్ కూతురనీ, ఆయన పోయి మూడు నెలలు పైనయిందనీ, ఎవరో యువకుడితో బోట్ షైర్ వెళ్ళిందనీ, ఆదే యువకుడితో నెల్లాళ్ళ క్రితం రెండు రోజులు బోట్ షికార్ వెళ్ళిందనీ చెప్పేడు.


వాసన పసిగట్టడంలో మా ఆవిడ ముందు ఏ వేటకుక్కా పనికి రాదు. ఇంటికి రాగానే "భోజనాని కింటికి రావడం లేటవుతుందని ఫోన్ చెయ్య గానే అనుకున్నాను ఆ దిక్కుమాలిన తాగుడు కోసమేనని" అంటూ స్వాగత వచనాలు పలికింది. మా ఆవిణ్ణీ మా అబ్బాయినీ గదిలోకి రమ్మని తలుపు దగ్గరగావేసి జోసఫీన్ రోజూకొక్కడితో బోట్‌షైర్ వెడుతుందనీ, ఇవ్వాళ నా కళ్ళతో నేను ఓ హిప్పీగాడితో సరసాలాడుతూ బోట్లో షికారుకొట్టడం మరో బోట్‌లోంచి నేను చూశాననీ, రేపు కూడా మరొకడితో తిరిగే ప్రోగ్రాం వేసుకున్నట్టు తెలిసిందనీ, శృంగారంతో రంగరించి ఓ పెద్ద మోతాదు వాళ్ళిద్దరి చేతా మింగించేను. "రంకుముండ కూతురు పతివ్రతవుతుందా! ఆ ముండ తనకి తల్లిలాంటిదనీ దాని కూతురు తనకి చెల్లెలనీ ప్రసాద్ మురిసిపోతూ మనం వీళ్ళింట్లోనే బసచెయ్యాలనీ ఎంత బలవంతం చేశాడు! ఇటువంటి దొమ్మరి కొంపలో దిగడం సిగ్గుచేటు. ఇప్పుడే దాని కూతురు భాగోతం బయటపెట్టి మొహం తగలేసి ఏదైనా హోటల్‌కి పోదాం." అంది మా ఆవిడ దాని సహజ ధోరణిలో.

"ఈ రభసంతా మనకెందుకు! ప్రసాద్‌ని వీళ్ళు బుట్టలో వేసుకున్నారు. మనం చెబితే నమ్మవొచ్చు నమ్మక పోవొచ్చు. రేపు బ్రేక్‌ఫాస్ట్ అవ్వగానే మూటాముల్లా సర్దుకుని మనదారి మనం మకాం ఎత్తేదాం." అన్నాను మా ఆవిణ్ణి సముదాయిస్తూ.

"నమ్మకపోతే నమ్మించే సాక్ష్యం చూపిస్తాం. మీ రిద్దరూ ఏమీ ఆవేశ పడకండి. రేపు మధ్యాన్నం నేను ఆ అమ్మాయిని వెంబడించి ఎవడితోనైనా కలిసి తిరిగిందంటే ఫోటో తెచ్చి మీకు చూపెట్టకపోతే నా పేరు ఆనంద్ కాదు." అని మావాడు ప్రతిజ్ఞ చేశాడు.

ఆ రాత్రి భోజనాల దగ్గిర స్టెల్లా తన కూతురు జోసఫీన్ గుణగణాదులు, పితృ భక్తి వివరిస్తూ మా ముగ్గురుకీ పరిచయం చేసింది. మేము వేసుకున్న రిహార్సల్ ప్రకారం ఓహో అంటే ఓహో అంటూ

(యువ అక్టోబరు 1960 సంచిక నుండి)



"[illegible]"

సంతోషం నటించేం. "అందచందాల్లోనూ తెలివితేటల్లోనూ తల్లిని మించిన కూతు రనిపించుకుంటుంది." అంటూ మా ఆవిడ ఆశీర్వదిస్తుండగా నేనూ ఆనందూ మొహాలకి నవ్వు పులుముకుని భోజనాని కుపక్రమించేం.

ఉదయం అయిదుగురం కూర్చుని బ్రేక్‌ఫాస్ట్ చేశాం. ఆ రోజు ఆదివారం కాబట్టి జోసఫీన్ కూడా యింట్లోనే వుంది.

కాళీ ప్లేట్లు తీసెయ్యడానికొచ్చిన హవుస్ మెయిడ్‌తో "ఇవాళ లంచ్‌లో మన అతిథులకు కాశ్మీరీ స్పెషాల్టీస్ రుచి చూపెట్టాలి" అంటూ స్టెల్లా ఆ డిషెస్ పేర్లు దండకంలా చదువుతుంది. "లంచ్‌కి మనం యిక్కడ వుండమని చెప్పెయ్యండీ" అంటూ మా ఆవిడ నా చెవి కొరికింది. అది గ్రహించిన మా అబ్బాయి ఆ విషయం నేను చూసుకుంటాను అన్నట్టు సౌంజ్ఞ చేశాడు. "వాడు కూడా వొచ్చేడు కనక సరిపోయింది. మిమ్మల్నే నమ్ముకుంటే కుక్కతోకట్టుకు...." అని మా ఆవిడంటుంటే "బై ది బై ఈ వుత్తరం ప్రసాద్ మీ కిమ్మన్నాడు" అంటూ, ప్రసాద్ యిచ్చిన వుత్తరమనుకుంటాను, స్టెల్లాకి ఆనంద్ అందించేడు.

స్టెల్లా కవర్‌ని చిరునవ్వుతో అందుకుని చించి చదువుతుంటే ఆమె మొహంలో రంగులు మారుతున్నాయి. మధ్య మధ్య మా అందరి మొహాలకేసి చూస్తూ "ఇటీజ్ సో ఇన్‌క్రెడిబుల్!... ఐ జస్ట్ కాంట్ బిలీవిట్!" అంటూ చదవడం పూర్తిచేసి ఆనందాశ్రువుల మధ్య ఆ వుత్తరం నా కందించింది. నేనూ మా ఆవిడా ఒకళ్ళ మొహాలూ వొకళ్ళు చూసుకుంటూ జంటగా చదవడం మొదలెట్టేం.

"అమ్మా! అందరూ యింట్లో వుంటారన్న వుద్దేశంతో ఆదివారం ఉదయం నీకీ వుత్తరాన్నివ్వమని ఆనంద్‌తో చెప్పేను.

"మేము హనీమూన్ కొచ్చినప్పుడు చెల్లాయ్ జోసఫీన్ని ఆనంద్‌కిచ్చి పెళ్ళి చేస్తే బాగుంటుందని నేనూ సుజాత అనుకున్నాం. తిరిగొచ్చిన తర్వాత ఆనంద్‌తో చెబితే సంతోషంగా ఒప్పుకున్నాడు. డాక్టర్ ఆనంద్ తెలివైనవాడు, చురుకైనవాడు, విశాలభావాలు కలవాడు. అన్నివిధాలా జోసఫీన్‌కి తగినవాడు. నెల్లాళ్ళ క్రితం ఢిల్లీకి వెళ్ళే మిషమీద శ్రీనగర్ వొచ్చి నాసలహామీద జోసఫీన్ని కలుసుకున్నాడు. ఆనంద్ వొచ్చి కలుసుకుంటాడనీ మనస్సు విప్పి మాట్లాడమనీ, సమయం వొచ్చేవరకూ యీ విషయం రహస్యంగా వుంచమనీ జోసఫీన్‌కి జాబు రాశాను. వాళ్ళిద్దరూ కలుసుకున్నారు, యిష్టపడ్డారు........"

"అది కాదండీ! నిన్న సాయంత్రం.." అంటూ మా ఆవిడ నాకేసి చుర చుర చూసింది.

"నిన్న సాయంత్రం హాస్పటల్ కెళ్ళి జోసఫీన్ని కల్సుకుని బోట్ షైర్‌కి నేనే తీసుకెళ్ళేను. నాన్నగారు జోసఫీన్ని చూశారు. నేను నాన్నగార్ని సిన్హాగార్ని చూసి వాళ్ళకి కనబడకుండా ఆటోస్టేండ్ కేసి పరిగెత్తేను. మిగిలిందంతా నాన్నగారి ఊహాగానం." అంటూ మా సుపుత్రుడు జేబులోంచి నెక్లెస్ తీసి జోసఫీవ్ మెళ్ళో తగిలిస్తుంటే నేను తెల్లబోయి చూస్తున్నాను

"అది సుజాతకి పెళ్ళిలో వాళ్ళ తాతగారిచ్చిన డైమండ్ నెక్లెస్.... రెండు లక్షలు...." అంటూ మా ఆవిడ వెర్రి మొహం వేసి నాకేసి చూస్తుంటే నా దృష్టి మళ్ళీ వుత్తరం మీదికి మళ్ళించేను.

"ఆనంద్‌తో ఈ శుభసమయంలో నిశ్చితార్థం చిహ్నంగా డైమండ్ నెక్లెస్ పంపుతున్నాను. అది మా అమ్మది. అంచేత స్త్రీ ధనం. న్యాయంగా జోసఫీన్‌కే చెందుతుందని సుజాత అంది. త్వరలోనే యిక్కడే నా చెల్లెలి పెళ్ళి సగౌరవంగా, సగర్వంగా, వైభవంగా జరిపిస్తాను."

"జోసఫీన్ బెంగ నే నర్థం చేసుకున్నాను. నాకు రాసింది. తను హైదరాబాద్ వెళ్ళిపోతే శ్రీనగర్‌లో నువ్వొక్కత్తివీ ఏకాకివై పోతావని, ప్రపంచ జ్ఞానంలేక, చెప్పుడు మాటలు విని నాన్నగార్ని పోగొట్టుకున్నాను. మీ వాత్సల్యానికి దూరమయ్యాను. నీకు తీరని అన్యాయం జరిగిపోయింది. ఇంకా నీ కన్యాయం చెయ్యలేను అంచేత నేనూ సుజాతా ఆనందూ ఆలోచించి ఓ నిర్ణయాన్ని కొచ్చేం. ఆనంద్, మా నాన్నగారి స్థానంలో శ్రీనగర్‌లో ప్రాక్టీస్ పెడతాడు. జోసఫీన్ యమ్మెస్ పూర్తి చేసింతర్వాత యిద్దరూ కలిసి ప్రేక్టీసు చేస్తారుట "....

"జోసఫీన్ పెళ్ళయింతర్వాత నువ్వక్కడ వుండటానికి వీల్లేదు. ఏడాదికి ఆర్నెల్లు కొడుకు దగ్గిర ఆర్నెల్లు కూతురు దగ్గిరా వుంటానని మాటివ్వాలి. నీ ఆశీస్సుల కోసం ఎదురు చూసే నీ కొడుకు-ప్రసాద్."

